సరిహద్దు చొరబాటుపై భగ్గుమన్న భారత్.. పాక్ దౌత్యవేత్తకు సమన్లు

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-221 సోమవారం 05-10-2026

యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

- సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్
- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్ - మిగతా 2 లో

పైలట్‌పై దాడి ఎఫెక్ట్.. టెల్ అవీవ్‌కు విమానాలు నిలిపివేసిన ఫ్లైదుబాయ్

- దుబాయ్ విమానంలో కెప్టెన్‌పై దాడి ఘటన
- అధికారుల ఆదేశాలతో టెల్ అవీవ్‌కు విమాన సర్వీసుల రద్దు
- భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా కొనియాడిన నెతన్యాహు

తమ విమానంలో కెప్టెన్‌పై కో- పైలట్ దాడి చేసిన ఘటన నేపథ్యంలో, ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను - మిగతా 2 లో

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు

2 లో..

- పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు
- పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు మొత్తం 13 రోజుల సెలవులు
- జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు సెలవులు
- అక్టోబర్ 23న స్కూళ్లు, 22న కాలేజీలు తిరిగి పునఃప్రారంభం
- సెలవులకు ముందు రోజే ముగియనున్న సమ్మేటివ్-1 పరీక్షలు

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన



2లో

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

చివరి నిమిషంలో కీలక నిర్ణయం!



- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ - మిగతా 2 లో

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా - మిగతా 2 లో

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే వదంతులు నమ్మొద్దు

2 లో..

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు

- మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!
- చర్చల్లో నాలుగు కాల్పుల విరమణ ప్రతిపాదనలు
- భారత్ ప్రతిపాదన సమగ్రంగా ఉందన్న ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి
- ఇంధన రంగంపై దాడులు ఆపాలని కోరుతున్న ఉక్రెయిన్
- నల్ల సముద్రంలో సంధిపైనా జరుగుతున్న చర్చ
- మరోవైపు మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్

2లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి. ఈసారి భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ నుంచి కీలక స్పందన వచ్చింది. కాల్పుల విరమణ కోసం

డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు

2 లో..

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్ పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (సా-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

మొదటిపేజీ తరువాయి – కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి – (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జిమెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

మొదటిపేజీ తరువాయి – మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి – వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

మొదటిపేజీ తరువాయి – ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

పైలట్‌పై దాడి ఎఫెక్ట్.. టెల్ అవీవ్‌కు విమానాలు నిలిపివేసిన ఫ్లైదుబాయ్

మొదటిపేజీ తరువాయి – తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దుబాయ్‌కు చెందిన విమానయాన సంస్థ ఫ్లైదుబాయ్ ప్రకటించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని, అధికారుల అభ్యర్థన మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఫ్లైదుబాయ్ సీఈఓ గైత్ అల్ గైత్ తెలిపారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు 172 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫ్లైదుబాయ్ ఫ్లీ 1073 విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న సహ పైలట్, భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డాడు. దీంతో విమానం నిమిషం వ్యవధిలోనే దాదాపు 17,000 అడుగుల కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యంగా కాక్‌పిట్ డోర్‌ను తెరవడంతో ప్రయాణికులు, ఇతర సిబ్బంది లోపలికి ప్రవేశించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో హీరోగా నిలిచిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాల్‌లో మాట్లాడి ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. 'ది గార్డియన్' కథనం ప్రకారం, "నా ప్రాణాల కోసం పోరాడాను. నేను లేవకపోతే ప్రయాణికుల ప్రాణాలు పోతాయని గ్రహించి, చివరి శక్తి కూడగట్టుకుని కాక్‌పిట్ డోర్ తెరిచాను" అని కెప్టెన్ మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా కెప్టెన్‌ను హీరోగా కొనియాడారు. దాడికి పాల్పడిన ఒమన్ జాతీయుడైన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన వెనుక ఉగ్రవాద కోణం ఉందా అనే దానిపై యూఏఈ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఫ్లైదుబాయ్‌తో పాటు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ కూడా టెల్ అవీవ్‌కు తమ కోడ్‌షేర్ విమానాలను రద్దు చేశాయి. దీంతో యూఏఈలో చిక్కుకున్న ఇజ్రాయెల్ పౌరులను స్వదేశానికి తరలించడానికి ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేస్తున్నారు.

పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

మొదటిపేజీ తరువాయి – అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఫ్యూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 1300 మంది పోలీసులతో కీలక భేటీ రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది

మొదటిపేజీ తరువాయి – చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు

తమకు నాలుగు ప్రతిపాదనలు అందాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహా తెలిపారు. భారత్, అమెరికా, టర్కీ, ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో.. భారత్ ప్రతిపాదన అత్యంత సమగ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

భారత్ ప్రతిపాదనలో ఏముంది?

భారత్ ప్రతిపాదన వివరాలను పూర్తిగా బయటపెట్టలేదు. అయితే ఉక్రెయిన్ ప్రకారం.. ఇంధన రంగంతో పాటు నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంధన కేంద్రాలు, ఓడరేవులపై దాడులు నిలిపివేయడం కూడా కీలక అంశంగా ఉంది. నల్ల సముద్రంలో నౌకాయానం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సజావుగా సాగేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

నాలుగు ప్రతిపాదనలు

రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణ కోసం ప్రస్తుతం నాలుగు దౌత్య ప్రతిపాదనలు చర్చల్లో ఉన్నాయి. టర్కీ, ఈజిప్ట్ కలిసి నల్ల సముద్రంలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలు కల్పించే సంధిని ప్రతిపాదించాయి. అమెరికా ఇంధన మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడంపై దృష్టి పెట్టింది. భారత్ ప్రతిపాదన మాత్రం ఇంధన రంగం, నల్ల సముద్రం అంశాలను కలిపి చూస్తోంది.

ఉక్రెయిన్ ఏం చెబుతోంది?

కాల్పుల విరమణలో ఇంధన రంగం, నల్ల సముద్రం రెండూ కలిసే ఉండాలని ఉక్రెయిన్ కోరుతోంది. ఓడరేవులు సహా అన్ని ఇంధన మౌలిక వసతులపై దాడులు పూర్తిగా

ఆగాలని సిబిహా స్పష్టం చేశారు. అదే సమయంలో యుద్ధ ప్రాంతం వెంట షరతులు లేని కాల్పుల విరమణను కూడా పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు.

మోదీపై పుతిన్ ప్రశంసలు

ఈ పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రధాని నరేంద్ర మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశాన్ని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్నారని ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. ఇరువైపులా ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శాంతియుతంగా, త్వరగా సమస్య పరిష్కారం కావాలని మోదీ కోరుతున్నారని పుతిన్ అన్నారు.

ముందున్న సవాలు ఏంటి?

భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ సానుకూలంగా స్పందించినా.. కాల్పుల విరమణ అమలుకు రష్యా అంగీకారం కూడా కీలకం. ప్రస్తుతం నాలుగు ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి. వాటిలో ఏది ఆచరణలోకి వస్తుందన్నది రాబోయే దౌత్య చర్చలపై ఆధారపడి ఉంటుంది.

మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి – ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది. మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది. ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి – ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వరద ముంపుకు చెక్

ధరణి నగర్ నాలకు మహా విస్తరణ

రూ.8.76 కోట్లతో పరికి చెరువు అలుగు నుంచి ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్ వరకు ఆర్ సి సి బాక్స్ డ్రైన్

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి: పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.......

ఆల్విన్ కాలనీ, అక్టోబర్ 4, నిలువుటద్దం ప్రతినిధి: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ నాల విస్తరణ పనులకు వేగం పెంచి, ఏళ్ల తరబడి ప్రజలను వేధిస్తున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు శేరిలింగంపల్లి నియోజకవర్గ పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. పరికి చెరువు అలుగు నుంచి ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.8 కోట్ల 76 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న ఆర్ సి సి బాక్స్ డ్రైన్ నిర్మాణం, ఆర్ సి సి బెడ్, సైడ్ వాల్స్, నాల విస్తరణ పనులను ఉమ్మడి ఆల్విన్ కాలనీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఎస్ ఎన్ డి పి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఎస్ ఎన్ డి పి ఫేజ్--2లో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.79 కోట్ల 58 లక్షల అంచనా వ్యయంతో నాలల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే అనేక సంవత్సరాలుగా లోతట్టు ప్రాంతాల ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ధరణి నగర్ నాలలో భాగంగా పరికి చెరువు అలుగు నుంచి ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్ వరకు చేపడుతున్న రూ.8.76 కోట్ల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న నాల విస్తరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. "గతంలో వర్షం పడితే చాలు.. వరద నీరు కాలనీలను ముంచెత్తడంతో ప్రజలు కంటి మీద కునుకు లేకుండా ఆందోళన చెందేవారు. భవిష్యత్తులో ఆ పరిస్థితి పునరావృతం కాకుండా పటిష్టమైన నాలా వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యం" అని గాంధీ పేర్కొన్నారు. నాల విస్తరణ పనులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రజా అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పనులు

నాలా విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గాంధీ సూచించారు. ప్రధాన రహదారులపై పనులు చేపట్టే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని తెలిపారు. నాల నిర్మాణ సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా సరైన లెవల్స్‌ను నిర్ధారించుకుని పనులు చేపట్టాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నాణ్యతలో రాజీ వద్దు

నాల విస్తరణ, ఆర్ సి సి బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని గాంధీ స్పష్టం చేశారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి వర్షాకాలంలో వరద నీరు కాలనీల్లోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతోనే నాలా విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆర్ సి సి బాక్స్ డ్రైన్ నిర్మాణంతో పాటు నాలా విస్తరణ పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.

"చిన్న సమస్యైనా నా దృష్టికి తీసుకురండి"

నాలా విస్తరణ పనుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని గాంధీ తెలిపారు. పనులకు సంబంధించి ఏ చిన్న ఇబ్బంది ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా ఉన్న నాలా విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మరోసారి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎం డి పి ఇంజనీరింగ్ విభాగం ఎఇ నిఖిల్, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం

పట్టభద్రుల ఓటే ప్రజాస్వామ్యానికి బలం.......

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి

మోతీనగర్‌లో ఓటరు నమోదు--సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన జనసేన జాయినింగ్స్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్......

కూకట్‌పల్లి, అక్టోబర్ 4, నిలువుటద్దం ప్రతినిధి: తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు నమోదు, సహాయ కార్యక్రమం కూకట్‌పల్లి నియోజకవర్గం మోతీనగర్‌లో ఉత్సాహంగా ప్రారంభమైంది. జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జాయినింగ్స్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పట్టభద్రుల ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఓటర్లు తమ హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన వివరాలు, ప్రక్రియ, దరఖాస్తుకు కావాల్సిన సమాచారం తదితర అంశాలపై మోతీనగర్ ప్రాంతంలోని గ్రాడ్యుయేట్లకు జనసేన నాయకులు, కార్యకర్తలు సహకారం అందిస్తారని తెలిపారు. ఓటరు నమోదు విషయంలో ఏవైనా సందేహాలు ఉన్నవారు కార్యక్రమం వద్ద అందుబాటులో ఉన్న జనసేన ప్రతినిధులను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని సూచించారు. మోతీనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును నమోదు చేసుకోవాలని ప్రేమ కుమార్ కోరారు. ప్రతి అర్హుడైన గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదై, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా జనసేన శ్రేణులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, భవిష్యత్ అవసరాలపై ప్రజాప్రతినిధులను ప్రశ్నించే శక్తి ఓటు హక్కుతోనే సాధ్యమవుతుందని, అందువల్ల అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ముందుకు రావాలని జనసేన నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, బడే విశ్వేశ్వరరావు, ప్రభు చైతన్య అరేటి, మిరియాల చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావుతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదుకు సహకరించారు.

ఓబీసీ కులగణన కోసం మహాగర్జన

శంషాబాద్ భారీ బహిరంగ....... సభ--ర్యాలీలో డీసీసీ సెక్రటరీ శిరీష సత్తూరు

బీసీల హక్కులు--సామాజిక న్యాయం కోసం కులగణన తప్పనిసరి: శిరీష సత్తూరు........

శంషాబాద్, అక్టోబర్ 04, నిలువుటద్దం ప్రతినిధి: జాతీయ జనగణనలో ఓబీసీ కులగణనను చేర్చడంతో పాటు బీసీలకు జనాభా ప్రాతిపదికన సామాజిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌తో శంషాబాద్ షర్లపల్లిలో నిర్వహించిన భారీ ఓబీసీ బహిరంగ సభ, ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. బీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ సెక్రటరీ శిరీష సత్తూరు పాల్గొని బీసీ కులగణనకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీల హక్కుల సాధనకు సంఘీభావం తెలిపారు.

భారీ ర్యాలీలో శిరీష సత్తూరు

ఓబీసీ కులగణన డిమాండ్‌ను బలంగా వినిపిస్తూ నిర్వహించిన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్తో కలిసి శిరీష సత్తూరు పాల్గొన్నారు. బీసీలకు న్యాయం చేయాలంటే వారి వాస్తవ జనాభా, సామాజిక--ఆర్థిక పరిస్థితులు, విద్యా మరియు ఉద్యోగ అవకాశాల్లో ఉన్న వెనుకబాటుతనంపై స్పష్టమైన గణాంకాలు అవసరమని నాయకులు పేర్కొన్నారు. అలాగే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్తో కలిసి కులగణన సాధన కోసం నిర్వహించిన కార్యక్రమంలో శిరీష సత్తూరు భాగస్వాములయ్యారు. బీసీల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాయకులు వివరించారు.

బీసీల అభివృద్ధికి కులగణనే ఆధారం

బీసీలకు సామాజిక న్యాయం అందించడంతో పాటు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలంటే సమగ్ర కులగణన ఎంతో కీలకమని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రిజర్వేషన్లు, అవకాశాల రూపకల్పనకు కులగణన ద్వారా లభించే ఖచ్చితమైన గణాంకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి బీసీ కుటుంబానికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నాయకులు తెలిపారు. బీసీల హక్కుల కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

శేరిలింగంపల్లి నుంచి భారీ స్పందన

బీసీ కులగణన కోసం నిర్వహించిన ఈ భారీ బహిరంగ సభ, ర్యాలీకి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పట్ల శిరీష సత్తూరు హర్షం వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న స్పందన సామాజిక న్యాయం కోసం ఉన్న బలమైన ఆకాంక్షకు నిదర్శనమని అన్నారు. ఓబీసీ కులగణన సాధించే వరకు బీసీల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని, కులగణన ద్వారా బీసీల వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, ఆ గణాంకాల ఆధారంగా భవిష్యత్ విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని శిరీష సత్తూరు స్పష్టం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం శంషాబాద్‌లో జరిగిన ఈ భారీ సభ, ర్యాలీ బీసీ ఐక్యతను చాటిచెప్పే కార్యక్రమంగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

ఈనెల 5వ తేదీ నుండి తెలంగాణాలో రేపటి నుంచి బార్లు బంద్ !

నిలువుటద్దం అక్టోబర్ 4 శేరిలింగంపల్లి ప్రతినిధి: తెలంగాణలో నేటి సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. బార్ల లైసెన్స్ నిబంధనలు, ఫీజుల పెంపు పేరుతో ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో రూ.40 లక్షలుగా ఉన్న లైసెన్స్ ఫీజును రూ.44 లక్షలకు పెంచి భారం మోపుతున్నారని మండిపడింది. ప్రివిలేజ్ సెస్‌ను స్లాబ్ పద్ధతిలో 8% నుంచి 20 శాతానికి పెంచారని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

క్యాసారంలో 'అక్రమ' వెంచర్ల జోరు!

"అనుమతుల్లేవ్.. అమ్మకాలు ఆగవ్!"

వారాహి టౌన్‌షిప్.. ప్లాటినం గ్రీన్ విల్లా పేరుతో బహిరంగంగా ప్లాట్ల విక్రయాలు!

వ్యవసాయ భూముల్లో ప్లాట్లు

అనుమతుల్లేకుండా అభివృద్ధి పనులు

కాగితాలపై ప్లాన్‌తోనే విక్రయాలు

"అనుమతుల్లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తూ రియల్టర్లు అమాయకులను మోసం చేస్తున్నారు. వెంచర్‌కు డీటీసీపీ, రెరా అనుమతులున్నాయంటూ, తక్కువ రేటు అంటూ అందమైన కరపత్రాలు ముద్రించి అరచేతిలో స్వర్గాన్ని చూపుతూ కొనుగోలుదారులకు ప్లాట్లు అంటగడుతున్నారు. క్యాసారం గ్రామంలో పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. ప్లాట్లు కొన్న సామాన్యులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. అధికారుల కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా వారు చేష్టలుడిగి చూస్తున్నారు.

పటాన్‌చెరు, నిలువుటద్దం ప్రతినిధి ,అక్టోబర్ 04: పటాన్చెరు నియోజకవర్గంలోని భూముల ధరలకు డిమాండ్ పెరగడంతో క్యాసారం పరిధిలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జోరందుకున్నాయి. 'వారాహి టౌన్‌షిప్', 'ప్లాటినం గ్రీన్ విల్లా ప్లాట్స్' పేర్లతో భూములు చదును చేసి, రోడ్లు, ప్రహరీలు ఏర్పాటు చేస్తూ ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయి. అయితే ఆయా వెంచర్ల అనుమతులపై స్పష్టత లేకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది.

పనులు జోరుగా.. అనుమతులపై స్పష్టత ఏది?

గత మూడు నెలలుగా వెంచర్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. డీటీసీపీ, హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులున్నాయా? లేవా? అన్నది అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అనుమతుల వివరాలు తేలకముందే ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయి.

"డీటీసీపీ.. హెచ్ఎండీఏ.. రెరా"

కొనుగోలుదారులకు డీటీసీపీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉన్నాయని చెబుతూ తక్కువ ధర, బ్యాంకు రుణం, ఎల్ఆర్ఎస్ భారం ఉండదని, రోడ్లు, నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తామని ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. ఈ అనుమతుల ధ్రువపత్రాలు, ఆమోద వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

ఫామ్ ల్యాండ్ పేరుతో చిన్న యూనిట్లు

వ్యవసాయ భూములను 'ఫామ్ ల్యాండ్' పేరుతో చిన్న యూనిట్లుగా విభజించి విక్రయిస్తున్నట్లు సమాచారం. రోడ్లు, ఫెన్సింగ్, ప్రహరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క గుంటకు రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ధరలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎకరం రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్లకు కొనుగోలు చేసి, అభివృద్ధి అనంతరం రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు విక్రయిస్తున్నట్లు స్థానిక సమాచారం.

అధికారుల మొద్దు నిద్ర ఎందుకు?

ఫిర్యాదు అందినట్లు సమాచారం ఉన్నప్పటికీ వెంచర్ల అనుమతులు, భూ వినియోగం, లేఅవుట్ నిబంధనలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అనుమతులు ఉంటే వివరాలు వెల్లడించాలి.. లోపాలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి అన్న డిమాండ్ వినిపిస్తోంది. క్యాసారంలోని వెంచర్లపై క్షేత్రస్థాయి తనిఖీ చేసి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెళ్లికి దూరశీ-- బాధ్యతకు దూరశీ-- బంధాలకు బీటలు

లివింగ్ రిలేషన్ పేరుతో విలువలకు విరామమా?

యువత ఆలోచించాల్సిన సమయమా?

నిలువుటద్దం ప్రత్యేక కథనం......

కాలం మారుతోంది... జీవన విధానాలు మారుతున్నాయి... ఆలోచనా ధోరణులు మారుతున్నాయి. ఒకప్పుడు జీవిత భాగస్వామిని ఎంచుకోవడం అంటే కుటుంబం, బంధాలు, బాధ్యతలు, సంప్రదాయాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకునే అంశంగా ఉండేది. ఇప్పుడు అదే వివాహ వ్యవస్థపై యువతలో కొంత భిన్నమైన ఆలోచన పెరుగుతోంది. అందులో భాగంగానే “లివింగ్ రిలేషన్” అనే జీవన విధానం సమాజంలో చర్చనీయాంశంగా మారింది. లివింగ్ రిలేషన్‌లో ఉండటం లేదా వివాహం చేసుకోవడం అనేది వ్యక్తిగత ఎంపిక. అయితే ఏ జీవన విధానమైనా బాధ్యత, పరస్పర గౌరవం, నమ్మకం, సమ్మతి, భద్రత, చట్టబద్ధ హక్కులు అనే అంశాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల దీనిపై భావోద్వేగాలతో కాకుండా సామాజిక బాధ్యతతో చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

బంధం ఉంటే బాధ్యత ఉండాలి... స్వేచ్ఛ ఉంటే సంయమనం ఉండాలి!

స్వేచ్ఛ అంటే బాధ్యతల నుంచి విముక్తి కాదు. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించాలనుకున్నప్పుడు వారి నిర్ణయాలు కేవలం వారి జీవితాలకే పరిమితం కాకుండా కొన్ని సందర్భాల్లో కుటుంబాలపై, పిల్లలపై, ఆస్తి సంబంధాలపై, మానసిక ఆరోగ్యంపై, సామాజిక సంబంధాలపై ప్రభావం చూపవచ్చు. వివాహ వ్యవస్థలో ఉన్న చట్టపరమైన హక్కులు, బాధ్యతలు, వారసత్వం, భరణం, పిల్లల సంరక్షణ వంటి అంశాలు స్పష్టంగా నిర్వచించబడి ఉంటాయి. లివింగ్ రిలేషన్ విషయంలో మాత్రం పరిస్థితి సంబంధాన్ని బట్టి మారవచ్చు. అందుకే “కలిసి ఉండటం” కంటే “ఎలా కలిసి ఉండాలి?” అనేదే అసలు ప్రశ్న. న్యాయస్థానం హక్కులను చెబుతుంది... జీవన విలువలను కుటుంబమే నేర్పాలి! లివింగ్ రిలేషన్‌లకు సంబంధించి భారత న్యాయస్థానాలు వివిధ సందర్భాల్లో వ్యక్తుల హక్కులు, గౌరవం, స్వేచ్ఛ, భద్రత వంటి అంశాలను పరిశీలించాయి. అయితే న్యాయస్థానం ఒక జీవన విధానాన్ని యువతకు ప్రోత్సహించడానికి లేదా కుటుంబ వ్యవస్థను బలహీనపరచడానికి ఉద్దేశించిన సంస్థగా చూడటం సరైంది కాదు.

చట్టం ఏది నేరం, ఏది హక్కు అనే విషయాన్ని నిర్ణయిస్తుంది; కానీ ఏది బాధ్యతాయుతమైన జీవితం అనేది సమాజం, కుటుంబం, వ్యక్తిగత విలువలు నిర్ణయించాలి. అందుకే లివింగ్ రిలేషన్‌పై చర్చించేటప్పుడు “కోర్టు అనుమతించింది కాబట్టి సరైనదే” లేదా “కోర్టు తప్పు చేసింది” అనే రెండు అంచుల మధ్య ఆగిపోకుండా, దాని సామాజిక ప్రభావాలను కూడా పరిశీలించాలి. పెళ్లంటే భయం ఎందుకు? బాధ్యతంటే వెనుకడుగు ఎందుకు? ప్రస్తుత తరంలో కొంతమంది యువత వివాహం అంటే ఆర్థిక భారం, వ్యక్తిగత స్వేచ్ఛకు పరిమితులు, కుటుంబ బాధ్యతలు, విడాకుల భయం వంటి కారణాలతో వెనుకడుగు వేస్తున్నారు. ఇది కేవలం యువత తప్పు అని చెప్పడం కూడా సరైంది కాదు. మారుతున్న ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగ ఒత్తిళ్లు, జీవన వ్యయం, కుటుంబ నిర్మాణంలో వచ్చిన మార్పులు, సోషల్ మీడియా ప్రభావం, వ్యక్తిగత స్వేచ్ఛపై పెరిగిన అవగాహన---ఇవన్నీ యువత నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే స్వేచ్ఛ పేరుతో బాధ్యతను వదిలేయడం కూడా పరిష్కారం కాదు. గ్రామీణ కుటుంబాలపై ఎందుకు కొత్త చూపు? కొంతమంది యువత పట్టణ జీవనశైలితో పోలిస్తే గ్రామీణ కుటుంబాల్లో కుటుంబ అనుబంధాలు, పెద్దల పట్ల గౌరవం, పరస్పర సహకారం, సంప్రదాయ విలువలు ఎక్కువగా కనిపిస్తాయని భావిస్తూ గ్రామీణ నేపథ్యం ఉన్న జీవిత భాగస్వాముల వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పవచ్చు. కానీ వ్యక్తి మంచితనాన్ని కేవలం “పల్లెటూరి వ్యక్తి” లేదా “పట్టణ వ్యక్తి” అనే నేపథ్యంతో నిర్ణయించలేం. విలువలు ప్రాంతంతో కాకుండా వ్యక్తిత్వంతో వస్తాయి.

తల్లిదండ్రుల పాత్ర ఎక్కడ?

యువతలో కుటుంబ విలువలు బలపడాలంటే తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వివాహం, సంబంధాలు, బాధ్యతలు, లైంగిక ఆరోగ్యం, చట్టపరమైన హక్కులు వంటి విషయాలను చిన్నచూపు చూడకుండా సరైన సమయంలో సరైన అవగాహన కల్పించాలి. పిల్లలకు కేవలం “ఇది తప్పు... అది చేయొద్దు” అని చెప్పడం కంటే, “ఎందుకు తప్పు? దాని పరిణామాలు ఏమిటి? బాధ్యతగా ఎలా నిర్ణయం తీసుకోవాలి?” అని వివరించాల్సిన అవసరం ఉంది. సంబంధం కాదు సమస్య... బాధ్యత లేని సంబంధమే సమస్య! వివాహం అయినా... లివింగ్ రిలేషన్ అయినా... ఏ సంబంధమైనా పరస్పర గౌరవం, సమ్మతి, విశ్వాసం, బాధ్యత, నిజాయితీ ఉంటేనే ఆరోగ్యకరమైన బంధంగా నిలుస్తుంది. ఒకరిని ఉపయోగించుకుని మరొకరు వదిలేయడం, మోసం చేయడం, హింసించడం, ఆర్థికంగా దోపిడీ చేయడం, పిల్లల బాధ్యత నుంచి తప్పించుకోవడం వంటి చర్యలను ఏ జీవన విధానం పేరుతోనూ సమర్థించలేం.

నేటి యువతకు నిలువుటద్దం ప్రశ్న

స్వేచ్ఛ కావాలా? తప్పకుండా కావాలి.
కానీ స్వేచ్ఛతో పాటు బాధ్యతను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామా?
ప్రేమ కావాలా? తప్పకుండా కావాలి.
కానీ ప్రేమతో పాటు నమ్మకం, గౌరవం, త్యాగం ఇవ్వగలమా?
పెళ్లి వద్దనుకుంటున్నామా? అది వ్యక్తిగత నిర్ణయం.
కానీ సంబంధంలోకి వెళ్లే ముందు దాని చట్టపరమైన, సామాజిక, భావోద్వేగ పరిణామాలను అర్థం చేసుకున్నామా?
ఇవే నేటి తరానికి అసలు ప్రశ్నలు.
నిలువుటద్దం ప్రశ్నిస్తుంది...
పెళ్లి మారిందా... మనసు మారిందా?
బంధం తగ్గిందా... బాధ్యత తగ్గిందా?
స్వేచ్ఛ పెరిగిందా... సంయమనం తగ్గిందా?
చట్టం హక్కులు చెప్పిందా... విలువలు మనం మర్చిపోయామా?

సమాజం మారడం సహజం. జీవన విధానాలు మారడం కూడా సహజమే. కానీ మార్పు పేరుతో మనిషితనం, పరస్పర గౌరవం, కుటుంబ అనుబంధం, బాధ్యత వంటి విలువలు కనుమరుగుకాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

ఎందుకంటే...
బంధం ఏదైనా కావచ్చు ---
బాధ్యత లేకపోతే అది బంధం కాదు...
బాధ్యతతో నడిస్తేనే అది జీవితం!

తొలిదశ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆత్మ బలిదానాలు

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ ఉద్యమానికి స్ఫూర్తి...

తెలంగాణ రాష్ట్రం వచ్చిన హౌస్ కీపింగ్. సెక్యూరిటీ గార్డ్. వాచ్మెన్. ఉద్యోగాలేనా సారు...

నిలువుటద్దం శేరిలింగంపల్లి అక్టోబర్ 4 ప్రతినిధి:(కే.బి. రాజు): తెలంగాణ రాష్ట్ర విభజన కోసం ఎందరో యువకులు. విద్యార్థులు. మేధావులు తొలి దశతో పాటు మలిదశలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు ఉద్యమం చేశారు. 1969 తొలి దశ ఉద్యమం 2001నుండి 2014 మలిదశ ఉద్యమంలో ఎంతో మంది నాయకులు కీలక పాత్ర పోషించగా వందలాది మంది యువత. విద్యార్థులు తమ ప్రాణాలను రాష్ట్ర సాధన కోసం బలిదానం చేశారు. ఉద్యమంలో చురుగ్గా ముఖ్య నాయకులు ప్రాణాలు అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ సిద్ధాంతకర్తగా పిలువబడే ఈయన తన జీవితాంతం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ప్రజలలో మేధావులలో చైతన్యం తెచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం టీజేఏసీ చైర్మన్ గా ఉండి సకలజనుల సమ్మె. మిలియన్ మార్చ్. సాగర హారం వంటి చారిత్రాత్మక నిరసనలు విజయవంతంగా నడిపించారు.

మర్రి చిన్నారెడ్డి 1969 తొలి దశ ఉద్యమంలో తెలంగాణ ప్రజా సమితి పార్టీ ఏర్పాటు చేశారు.

తెలంగాణ ప్రజా సమితి పార్టీలో అధ్యక్షుడిగా ఉద్యమానికి రాజకీయ నాయకత్వం వహించారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ తొలి తరశీ ఉద్యమకారుడు.

1969లో తెలంగాణ కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గద్దర్ తన విప్లమాత్మక గీతాలతో ఆటపాటలతో తెలంగాణ పల్లె పల్లెన ఉద్యమ జ్వాలను రగిలించారు. ఈశ్వరిబాయి. అనంతుల మదన్మోహన్. కాలోజి నారాయణరావు. వందేమాతరం రామచంద్రరావు. తొలి దశ ఉద్యమంలో రాజకీయంగా. సాంస్కృతికంగా ప్రజలను ఏకం చేశారు. పలువురు రాజకీయ నాయకులు విద్యార్థి సంఘాల నేతలు కెసిఆర్. హరీష్ రావు ఈటెల రాజేందర్. కాంగ్రెస్. బిజెపి లెఫ్ట్ పార్టీల ఉస్మానియా విశ్వవిద్యాలయం.కాకతీయ విశ్వవిద్యాలయం. విద్యార్థి జేఏసీ నేతల మలిదశ ఉద్యమంలో అత్యంత వ్యవహరించి కీలకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకువచ్చారు.

తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో దాదాపు 1200 మందికి పైగా ఆత్మర్పణ చేసుకున్నారు. వారిలో యావత్ దేశాన్ని కదిలించిన కొందరు ప్రముఖులు. 1969 తొలి దశ ఉద్యమంలో శంకర్ జనవరి 24వ తేదీన సదాశివపేటలో జరిగిన పోలీస్ కాల్పులలో తీవ్రంగా గాయపడి మరుసటి రోజు ప్రాణాలర్పించారు. 1969 ఉద్యమ మొదటి అమరుడయ్యాడు. అదే 1969 లో పోలీసుల కాల్పులలో 369 మంది విద్యార్థులు యువకులు తూటాలకు బలయ్యారు.

మలిదశ ఉద్యమంలో 2001 నుండి 2014 అమరులు..

కాసోజు శ్రీకాంతాచారి మలిదశ తెలంగాణ తొలి ఉద్యమ అమరుడయ్యారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఫిజియోథెరపీ విద్యార్థి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అరెస్టుకు నిరసనగా నవంబర్ 29న హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని డిసెంబర్ 3న అమరుడయ్యాడు. ఈయన త్యాగం ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఊగ్రుత లూగించింది. నిజాంబాద్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ కృష్ణయ్య ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 2009 డిసెంబరు 1న తన సర్వీస్ వారితో కాల్చుకొని ప్రాణత్యాగం చేశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన యువకుడు సిరిపురం యాదయ్య 2010 ఫిబ్రవరి 20న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లోపల జై తెలంగాణ అంటూ ఇప్పటించుకుని నిండు ప్రాణాన్ని ఆత్మార్పణ చేసుకున్నాడు. అదే నిజాంబాద్ జిల్లాకు చెందిన వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక రాష్ట్ర ప్రకటన ఆలస్యం కావడంతో తట్టుకోలేక 2010 జనవరి ఉస్మానియా క్యాంపస్ లో ఆత్మహర్పణ చేసుకున్నాడు. ఢిల్లీలోని పార్లమెంట్ సమీపంలో తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకుని దేశ రాజధానిని కదిలించిన యోధుడయ్యాడు. బొజ్జ నాయక్. ఈశాంత్ రెడ్డి. చిరబోయిన కనకయ్య. సువర్ణ సుధాకర్ వీళ్లంతా వివిధ సందర్భాలలో ప్రత్యేక రాష్ట్రం కోసం తూటాలకు బలి అవుతూ ఆత్మహర్పణలు చేసుకున్నారు. తెలంగాణ గడ్డపై ప్రాణాలు విడిచారు. విద్యార్థులు రైతులు ఆర్టీసీ కార్మికులు తమ ప్రాణాలను బలిదానం చేసుకుని చివరకు తెలంగాణ కలని సహకారం చేసిన ఘనత దక్కించుకున్నారు. కల్వకుంట్ల చంద్రశేఖర రావు మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. 2001 టిఆర్ఎస్ పార్టీని నడిపించి 2009లో ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలుపు తిప్పారు. నేటికీ తెలంగాణ కళా సహకారమైన సందర్భంలోనే కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమింపబడ్డాడు. కానీ నేటి వరకు ఆత్మ బలిదానాలు చేసుకున్న యువతకు ఉద్యోగాలు ఇస్తామని తెలంగాణ ఉద్యమ సాధనలో ఎన్నో ప్రకటనలు చేసిన ఫలితం లేకపోయిందని ఆత్మ బలిదానాలు చేసుకున్న యువకులు. విద్యార్థుల తల్లిదండ్రులు కంటతడి పెడుతున్నారు. కన్న పేగును తెంచుకున్న శ్రీకాంత్ ఆచారి తల్లి శంకరమ్మకు అప్పటి కెసిఆర్ ప్రభుత్వం కనీసం భిక్ష కూడా పెట్టలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత ఆమెకు హోదా కల్పించారు. ఉద్యమాలలో పాల్గొని ప్రాణాలను అర్పించిన వారి తల్లిదండ్రులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు మరెన్నో అవకాశాలు కల్పిస్తాయని ఆశిస్తున్నారు.

అసలు ఈ ప్రభుత్వాలు ఉన్నది ఉద్యమాలు చేసిన వారికా... లీడర్లకేనా...?

గతంలో కెసిఆర్ ప్రభుత్వం ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎన్నో ప్రాణ త్యాగాలు చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని. ఇంటింటికి ఉద్యోగం ఇస్తాం. మూడెకరాల భూమి దళితులకు పంపిణీ చేస్తామన్న హామీలు నీటి మూటల పాలయ్యాయని అనేక ఆరోపణలు ఉన్న విషయం తెలంగాణ ప్రజలకు తెలిసిందే. ఇప్పటివరకు తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి తల్లిదండ్రులకు ఉండడానికి గూడు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చేతిలో పెట్టినట్లు అయింది. నేటికీ భాగ్యనగరంలో. గ్రామాలలో నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం తిరుగుతున్న ఫలితం లేకపోయింది. హైదరాబాదులో మాత్రం డిగ్రీలు చదివి సెక్యూరిటీ గార్డులు. వాచ్మెన్. బాత్రూం క్లీనింగ్. హౌస్ కీపింగ్. ప్రైవేట్ కార్యాలయాలలో టేబుల్ తుడవడం లాంటి పనులు చేస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొడరా నీ తల్లి భూమి భారతిని.



యువతే కాంగ్రెస్‌కు వెన్నెముక

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం!

కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి: బండి రమేష్......

కూకట్‌పల్లి, అక్టోబర్ 04, నిలువుటద్దం ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీకి యువతే ప్రధాన బలమని, యువతను సమన్వయం చేసుకుంటూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.డి. సలీం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ యువత ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ బలోపేతం

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని బండి రమేష్ సూచించారు. యువతను పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు, స్థానికంగా ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న అవకాశాలను వివరించి, పార్టీ కార్యక్రమాల్లో మరింత మంది యువతను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు యువ నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు.

రాబోయే కార్యక్రమాలపై విస్తృత చర్చ

సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, ప్రతి డివిజన్‌లో సంస్థాగతంగా యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం, రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ భవ్య, డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ మున్నీర్ అహ్మద్, నాగార్జున, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ బొమ్మక్క అజయ్, స్టేట్ సెక్రటరీ రమ్యతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లేట్ నైట్ తినే అలవాటా.. వెంటనే మార్చుకోండి..

లేదంటే ఈ 5 వ్యాధులు జీవితాంతం వెంటాడతాయి..

గత కొన్నేళ్ళ క్రితం వరకూ తినడం, నిద్రపోవడం పని చేయడం ఇలా ప్రతి విషయంలోనూ కొన్ని నియమాలున్నాయి. రాత్రి త్వరగా తిని.. త్వరగా నిద్రపోవడం.. తెల్లవారుజామునే నిద్ర లేవడం చేసేవారు. అయితే మారిన కాలంతో పాటు జీవన శైలిలో కూడా అనేక మార్పులు వచ్చాయి. ఇప్పుడు తినడానికి, నిద్రపోవడానికి.. నిద్ర లేవడానికి కూడా సమయం సందర్భం లేదు. ఎప్పుడు బడితే అప్పుడు చేస్తున్నారు. అయితే ఆలస్యంగా తినడం అలవాటు మీకుందా.. ఈ అలవాటు ఎంత ప్రమాదమో ఈ రోజు తెలుసుకుందాం.. నేటి మనిషి జీవితం ఉరుకుల పగురులతో సాగుతోంది. కాలంతో పోటీ పడుతూ మనషి జీవిస్తున్న తరుణంలో జీవన శైలిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. దినచర్యలో కూడా మార్పులు జరుగుతున్నాయి. ఆలస్యంగా నిద్రపోవడం, ఆలస్యంగా తినడం చాలా మందికి అలవాటుగా మారింది. దీనికి కారణం పని భారం లేదా అధిక చదువుల ఒత్తిడి అని అని కూడా చెప్పవచ్చు. మనం ఎటువంటి టైమ్ టేబుల్ లేకుండా వివిధ కారణాల వల్ల తినే అలవాటులో విపరీతమైన మార్పులు వచ్చాయి. భోజనం చేయడానికి సమయం లేకపోతే..రాత్రి భోజనం ఆలస్యంగా తింటున్నారని నిపుణులు అంటున్నారు. అయితే ఇలా ఆలస్యంగా తినడం వలన ఆరోగ్యానికి స్లో పాయిజన్ గా ఆ ఆహారం మారుతుందని మీకు తెలుసా?

ఆలస్యంగా తినడం వల్ల నిద్ర నాణ్యతపై ప్రతికూల ప్రభావం

రాత్రి 8 గంటల తర్వాత తినడం వల్ల శరీరం జీర్ణక్రియ, హార్మోన్ల సమతుల్యత , నిద్ర నాణ్యతపై చెడు ప్రభావం చూపుతుందని నిపుణుల చెబుతున్నారు. సమయానికి ఆహారం తినకపోవడం వలన అనేక వ్యాధులకు కారణమవుతుంది. ఆలస్యంగా తినడం వల్ల కలిగే నష్టాలు.. దానిని నివారించే మార్గాలను తెలుసుకుందాం.

ఆలస్యంగా తినడం వల్ల కలిగే నష్టాలు ఏమిటి?

జీర్ణవ్యవస్థపై ప్రభావాలు: రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీరంలో జీర్ణ ప్రక్రియ మందగిస్తుంది. భోజనం చేసిన వెంటనే నిద్రపోయినప్పుడు.. ఆహారం సరిగ్గా జీర్ణం కాదు, దీనివల్ల గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. బరువు పెరగడం ఖాయం: రాత్రి ఆలస్యంగా భోజనం చేసినప్పుడు శరీరం ఆ ఆహారాన్ని జీర్ణం చేయడనికి బదులుగా కొవ్వుగా నిల్వ చేయడం ప్రారంభిస్తుంది. ఇది వేగంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. ముఖ్యంగా బొడ్డు, నడుము దగ్గర కొవ్వు పెరుగుతుంది.

ఈ పరిహారాలు చేసి చూడండి.. లక్ష్మీదేవి అనుగ్రహం మీ సొంతం

నిద్ర లేమి సమస్య: రాత్రి సమయంలో అధిక మొత్తంలో ఆహారం తినడం వల్ల శరీరంలో జీర్ణక్రియ ప్రక్రియ కొనసాగుతుంది. ఇది గాఢ నిద్రను నిరోధిస్తుంది. తరచుగా మేల్కొనడం, విశ్రాంతి లేకపోవడం లేదా నిద్రలేమి వంటి సమస్యలు కూడా సంభవించవచ్చు. మధుమేహం, గుండె జబ్బుల ప్రమాదం: ఆలస్యంగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అసమతుల్యత చెందుతుందని , ఇన్సులిన్ ప్రభావం తగ్గుతుందని, టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట: రాత్రి ఆలస్యంగా భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం వలన కడుపులో ఆమ్లం పెరుగుతుంది. ఇది గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్‌కు దారితీస్తుంది. మంచి ఆరోగ్యం కోసం ఏమి చేయాలంటే రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య భోజనం చేయండి. తిన్న తర్వాత కనీసం 2 గంటల వరకూ నిద్రపోవద్దు. అంటే తిన్న ఆహారానికి.. నిద్రకు మధ్య రెండు గంటల గ్యాప్ ఉండేలా చూసుకోండి. రాత్రి సమయంలో కిచిడి, గంజి లేదా కూరగాయల సూప్ వంటి తేలికైన , సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినండి. రాత్రి కెఫిన్ , చక్కెర కలిగిన ఆహారాలకు దూరంగా ఉండండి. దినచర్యలో యోగా, నడక, వ్యాయామం చేర్చుకోండి. రాత్రి భోజనం తర్వాత 10-15 నిమిషాలు నడవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది

ఆరోగ్యంతో పాటు ఐశ్వర్యం..

ఈ మొక్క ఇంట్లో పెంచితే పైసలు మస్తుగా వస్తాయి..!

వాస్తు నిపుణులు చెప్పినట్లు మందార పువ్వుకు దైవశక్తిని ఆకర్షించే శక్తి ఉంటుంది. ఈ మొక్కను పెంచడం వల్ల ఇంట్లో ఉండే దోషాలు పోతాయని నమ్మకం. ముఖ్యంగా ఈ మొక్కను తూర్పు లేదా ఉత్తర దిశలో పెంచితే మంచిదని చెబుతారు. ఈ రెండు దిశలు అదృష్టాన్ని ఆకర్షిస్తాయని వాస్తులో భావిస్తారు. మందార పూలు సాధారణంగా పల్లెటూళ్లలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇప్పటికీ చాలా పల్లెటూరి ఇళ్లలో ఇవి నెమ్మదిగా పెరుగుతూ.. ఇంటిని శుభంగా ఉంచే మంచి చిహ్నంగా ఉన్నాయి. ఈ మొక్కను ఇంట్లో పెంచడం వల్ల లక్ష్మీ కటాక్షం లభిస్తుందని నమ్ముతారు. అయితే మొక్క ఎండిపోకుండా తరచుగా నీరు పోస్తూ జాగ్రత్తగా పెంచాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారు.. అప్పుల్లో కూరుకుపోయిన వారు ఈ మందార మొక్కను ఇంట్లో పెంచితే దోషాలు తగ్గుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా శుక్రవారం రోజున మీ ఇంట్లో డబ్బు నిల్వ చేసే చోట మందార పూలను ఉంచి.. గణపతిని దుర్గాదేవిని ధ్యానిస్తే మంచి ఫలితాలు వస్తాయని నమ్మకం. ఈ పనిని 7 రోజులపాటు రోజూ చేస్తే డబ్బు సమస్యలు దూరమవుతాయట.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027